సాంఘికంగా అస్పృశ్యత దేశానికి తీరని అపచారము చేసింది. చేస్తున్నది. దాన్ని తొలగించటానికి చేసే ప్రయత్నాలు, దాన్ని పెంపొందించేవి అవుతూవుండడం మరీ హృదయ విదారకరం. ఒక లోపాన్ని తొలగించడానికి చేసే ప్రయత్నాలు, విద్వేషాన్ని ప్రజ్వరిల్లచేసి, వినాశనానికి దారితీసి చివరకు మరొక ఘోరతర లోపాన్ని తెచ్చిపెట్టటము చరిత్రలో తిరిగితిరిగి కనిపిస్తున్నది. ఆనాటి రాజుల క్రౌర్యాన్ని ఎదుర్కోటానికి పుట్టిన విప్లవం, ఘోర రక్తపాతంతో నెపోలియన్ నిరంకుశత్వంతో చివరకు ఫ్రాన్సుకు తీరని నష్టంతో అంతరించింది. రష్యాలో అదే జరిగింది. మన దేశములో హింసని అరికట్టటానికి పుట్టిన బౌద్ధమతం నిర్వీర్యల్తో దేశాన్ని నింపి, దేశాన్ని విదేశీయ దండయాత్రల పాలుచేసింది. అస్పృశ్యతని తొలగించటానికి గాంధీగారారంభించిన ఉద్యమం విపరీత విద్వేషాన్ని రగుల్కొల్పింది. విద్యాలయాలల్లో, ఉద్యోగాల్లో, ప్రత్యేక స్థానాలంటూ ఏర్పాటు చేసి మనప్రభుత్వం, ఈ విద్వేషసర్పాన్ని పాలు పోసి పెంచుతున్నారు. కొమ్మమీద నిల్చొని మొదలు నరుక్కొనే తెలివితేటలివి.

ఏలోపాన్నైనా తొలగించాలంటే, ఆలోపానికి వ్యతిరేకమైన గుణాన్ని తీసుకురావాలి. ఆ గుణం లేకపోవటంవల్ల ఆ లోపం వచ్చిందని గ్రహించినప్పుడు, ఆ లోపాన్ని పోగొట్టటానికి మార్గాంతరంలేదని గ్రహించితీరాలి. అలా గుణాన్ని పెంపొందించే పద్ధతినే నిర్మాణాత్మక విధానం అంటారు. చీకటి పోవటానికి దీపం తీసుకురావటం తప్ప మార్గం ఏమన్నా ఉందా? దేశంలో విభేదాలు కలగటానికి కారణం, విద్వేషాలకి మూలం, అందరం ఒకటే అనే ఏకభావంలో అదృశ్యమవటం. ఆ ఐక్యతను తీసుకురాగలిగితే విభేదాలు వాటంతటవే చెప్పకుండా లేచిపోతయ్. అంతేగాని హరిజనులని పేరుపెట్టి దేవాలయాల్లోకి తీసికెళ్ళితేనూ కాఫీహోటల్లోకి రానిస్తేనూ బావిలో నీరుతోడుకోనిస్తేనూ, అస్పృశ్యత భయపడి పారిపోదు. మన తెలివితక్కువకి పకపకా నవ్వుతుంది. అది పెద్ద నేరమనీ, పాటించినవారికి కఠినశిక్ష అనీ పార్లమెంటు శాసనాలుచేస్తే బెదిరిపోయేది కాదీ భూతం. ప్రభువు లికనైనా మేల్కొని ఐక్యతని వికసింపచేసే నిర్మాణాత్మకమార్గాల్ని అనుసరిస్తారా? సంస్కరణలనుకొంటూ సర్వనాశనం చేసి పుణ్యం మూటగట్టుకొంటారా?

---

స్కెచ్

# మానవనైజం

కొమ్మూరి వేణుగోపాలరావు

"నేను యివాళనుండీ యిక అబద్ధం చెప్పను. నిజం తప్ప యింకోటి పలుకను" అనుకున్నాడు సుదర్శనం, ఉదయం ఆరుగంటలకి.

నిజానికి సుదర్శనం మనస్ఫూర్తిగా అనుకున్నాడు. అతన్నిగానీ, అతని మనస్సునుగాని అనుమానించవల్సిన అవసరం ఏదీ?

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

తల ఎత్తిచూశాడు, పిలుస్తున్నది భార్య అని తెలిసే—

"అహాఁ ఏంలేదు."

"ఏంలేకపోవటం మేమిటి? ఆలోచిస్తానే. ముందు కాఫీ తీసుకోండి."

సుదర్శనం మాట్లాడకుండా కాఫీతీసుకున్నాడు. కాని అతని మనస్సు చివుక్కుమన్నది.

తను అబద్ధంచెప్పాడా?

అప్పుడే అనుమానం. నిజానికి తను అబద్ధాలు చెప్పడం ఎలా మానెయ్యాలో ఆలోచిస్తున్నాడు. ఇంతలోనే భార్య... మాలతి వచ్చి అడగనే అడిగింది. తను ఏంలేదని అబద్ధచెప్పాడు.

అప్పుడే ఒక అబద్ధం ఆడాడన్నమాట!

కాని సుదర్శనం తననితాను సమర్థించుకోక తప్పలేదు. ఇటువంటి విషయాలు రహస్యం అని కాదు దాయటం. చెప్పటం కష్టం. చెప్పటం యిష్టంకూడా వుండదు.

ఆలోచిస్తూనే కాఫీ త్రాగి భార్యచేతికి గ్లాసు అందిచ్చాడు.

''ఇంతకీ ఆలోచన ఏమిటో చెప్పారుకారు.''

''ఏంలేదంటుంటే?''

మాలతి వెళ్ళిపోయింది. సుదర్శనం లేచాడు.

స్నానం అదీ పూర్తి అయేటప్పటికి ఎనిమిది యింది. కూరల సంచీ పుచ్చుకుని బజారుకు బయల్దేరాడు. దార్లో మూర్తి కనిపించాడు. వద్దు వద్దంటున్నా హోటలుకు తీసుకుపోయాడు.

"రెండుప్లేట్లు యిడ్లీ."

సుదర్శనం మాట్లాడకుండా ఎదురుచూస్తున్నాడు.

"ఇవాళ 'లీలా'లో మంచి పిక్చర్ వుంది. వెళ్దామా?"

సుదర్శనానికి పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టయింది. ఏంచెబుతాడు? రానంటే? డబ్బు కోసం చూసుకుంటున్నాడనుకుంటాడు. 'డబ్బు నువ్వే పెట్టుకోవాలని కాదులే. పిల్చింది నేను' అంటాడు.

"ఇవాళ మా మిసెస్‌తో వెడదామనుకుంటు న్నానోయ్" అన్నాడు చిన్నగా.

"దేనికి?"

"తెలుగు..."

"ఫర్వాలేదు. అదయితే యింకాకొన్నిరోజుల పాటయినావుంటుంది. ఇది యివాళిటితో ఆఖరు"

మూర్తితోవున్న చిక్కు యిదే. ఇంకొకరైతే భార్యతో సినిమాకి వెడతానంటే మళ్ళీ మాట్లాడటానికి కూడా జంకి వూరుకుంటారు. కాని యీ మనిషి అలా వూరుకునే రకం కాదు.

"కాని..."

"ఫర్వాలేదు లెద్దూ?"

సుదర్శనం మాట్లాడలేకపోయాడు. ఇడ్లీ వచ్చింది...

"కాఫీ?"

"వద్దు. ఇంట్లో తాగేవచ్చాను."

"పర్వాలేదు లెద్దూ. రెండు కాఫీ."

బయటికి వచ్చారు, కొంతసేపటి తర్వాత. "వెడతాను భాయి. సాయంత్రం అయిదున్నరకల్లా రెడీ. ఊఁ!" మూర్తి వెళ్ళిపోయాడు.

నేను అప్పుడే యింకో అబద్ధం చెప్పేశానా? ఎందుకు చెప్పాను? పోనీ అబద్ధం ఆడినందుకు ఫలితం ఏమయినా దక్కిందా? అని ప్రశ్నలు వేసుకున్నాడు సుదర్శనం. ఆతనికి విచారము ముంచుకు వచ్చింది.

ఇంటికి వెళ్ళాడు. కూరలసంచీ ఆవిడ చేతికి యిచ్చి, "త్వరగా కానియ్యి" అని చెప్పాడు. ఈజీ ఛైరులోవాలి రాత్రి సగం చదివి వదిలిన 'నానా' విప్పాడు.

భోజనం చేసేటప్పటికి పదయింది. పది నిముషాల్లో ఆఫీసుకుపోవాలి. అంతవరకే క్షమాపణ. చెప్పులు తొడుక్కొని బయల్దేరాడు.

ఇల్లుదాటి యింకో రెండుఫర్లాంగులు రాలేదు. ఆఫీసు యింకా మూడు ఫర్లాంగులువుంది. ఇంతలోకే పోస్టాఫీసు అడ్డువచ్చింది. అప్పుడే పోస్టుమెన్ బయటికి వస్తున్నాడు.

"ఇవాళన్నా మనియార్డరురావాలి మామయ్య దగ్గర్నుంచి తప్పకుండా పంపిస్తానన్నాడు" సుదర్శనంకి చప్పున గుర్తువచ్చింది. తన పోస్టుమేన్ ఎక్కడ వుంటాడో వెతుక్కుంటూ నడిచాడు. అతనయితే ప్రక్కనేవున్న ప్రెస్ అరుగుమీద కూర్చుని కనిపించాడుగాని, తన విషయం అడగాలంటే సుదర్శనానికి వెంటనే సాధ్యపడలేదు. ఉత్తరాలకోసం చుట్టూ జనం. ఎట్లాగో తలకాయ లోపలకు దూర్చి గొంతుచేసుకున్నాడు.

"నా కేమన్నా ఉత్తరాలున్నాయా పోస్టుమేన్?"

ఈ ప్రశ్నకు జవాబుకోసం పోస్టుమేన్ కొన్ని సెకన్లుమట్టుకు ఆలోచించి "ఆ వున్నాయండీ. ముందీహడావుడీ అయిపోతే!" అంటూ ఆ గొడవలో పడిపోయాడు.

"ఎమ్. ఓ. యేనా?"

ఈప్రశ్న అతనికి వినిపించలేదు.

నిమిషాలు గడిచిపోతున్నాయి. జనం చాలా నిమ్మదిగా తరుగుతున్నారు. సుదర్శనానికి వచ్చినది ఏమిటో చూడాలన్న ఆత్రుతా, ఆఫీసుకు

త్వరగా పోవాలనే భయమూ ఎక్కువయి పోయాయి.

"నాకు కాస్త చెప్పనచూడు" అని అన వొచ్చు అతను కాని అనుకోకుండానే కొన్ని క్రొత్త మాటలుకూడా దొర్లుకువచ్చాయి. "మళ్ళీ మా ఆఫీసులో యివాళ యిన్‌స్పెక్షన్ వుంది. అర్జంటుగా పోవాలి పోస్టుమేన్" చాలా జాలిగా అన్నాడు. అనుకోనంత జాలిగా ఆ మాటలు అనటం ఎంతో ఉపకరించింది. మరునిమిషంలో అతని చేతికి ఒక కార్డుముక్క వచ్చింది.

"ఇంతేనా?"

"ఆఁ"

నిస్పృహతో చదువుకుంటూనే నడవసాగాడు. రాసింది మామయ్యే. డబ్బింకో వారంరోజులకు గాని సర్దలేనని అందులోని సారాంశం.

కార్డుమడిచి జేబులోకి తోసి మెల్లిగా అడుగులు వేశాడు ఆఫీసులోకి పదినిమిషాల తర్వాత.

"ఆలస్యం అయినట్లుందే యివాళ?"

ఆ కంఠస్వరం ఎవరిదో చెప్పనవసరంలేదు. సుదర్శనం అనుకోకుండానే అసందర్భ ప్రేలాపన చేశాడు.

"అహా. మా యింట్లోవాళ్ళని ట్రయినెక్కించి వస్తే..." అస్పష్టంగా గొణిగాడు.

"పదింటికి యిప్పుడేం ట్రయిన్."

"అహా. అహా. నైన్ డవును ముప్పావుగంట లేటు"

అంతకుమించి రాద్ధాంతం ఏం జరగలేదు. తన సీటులోకిపోయి కూచున్నాడు.

సాయంత్రం యింటికివచ్చేటప్పటికి నాలుగున్నర అయింది. మాలతి మేకప్ సన్నాహాలు చేసుకుంటున్నది.

"ఏమిటిదంతా?" అడిగాడు.

"సినిమాకు వెళ్దామండీ. సరస్వతీకి"

"బాగుంది. యింత అర్ధాంతరంగా చెబితే ఎలాగ?" కొంచం కోపంగానే అడిగాడు.

"నేనూ అనుకోలేదు. ఇందాక ప్రక్కింటి సుందరమ్మగారొచ్చి బాగుందని చెబితే..."

ఈ పరిస్థితుల్లో స్నేహితుడితో సినిమాకు వెళ్తానని చెప్పటం సుదర్శనానికి అసంభవం. కొంచం లాలింపుస్వరంతోనే "అదికాదు. మా ఫ్రెండురాసిన డ్రామా ఒకటి లైబ్రరీలో వేస్తున్నారు. తప్పకుండా రమ్మని చెప్పాడు. నే వెళ్లక పోతే...?" అన్నాడు. మాలతి ముఖంముడుచుకుంది. అతని అదృష్టవశాత్తూ డ్రామాకయినా తీసుకుపొమ్మని అడగలేదు.

సుదర్శనం బయటికి అయిదున్నరకి వెళ్లిపోయాడు.

తొమ్మిదింబావుకి యింటికివచ్చి పడుకున్నాడు సుదర్శనం- "అబద్ధాలు చెప్పకూడదనుకున్నాను. కాని యివాళ ఎన్ని ఆడాను?" అనుకున్నాడు.

నిజమే. సుదర్శనంవంటి మనుషులు అబద్ధం ఆడకుండా రోజులు గడపలేరు. పరిస్థితులకు అనుకూలంగా, అవసరాన్ని వెళ్ళబుచ్చడానికి ఆఫీసర్లకు భయపడీ, భార్యా భర్తలమధ్య కలహాలు రాకుండా వుండటానికి అబద్ధాలు ఆడాలి. పరిస్థితులకు ప్రతికూలిస్తే తను చెప్పేది అబద్ధం అని తెలియకుండానే మాట్లాడవల్సింది. అలా జరగకుండా తప్పదు. సుదర్శనానికి తెలుసు.

కాని యిన్నీ తెలిసే "ఇవాల్టికి ఏదో అయిపోయింది. రేపటినుంచి ఏమయినా అబద్ధాలు చెప్పను. నిజమే పలుకుతాను" అని నిశ్చయించుకున్నాడు కళ్ళుమూసుకుంటూ.

## ఒకటో ప్రేమగీతం

ఆరుద్ర

ప్రేయసీ నీకొరకు నారక్త మెలుగెత్తి
 యుప్పొంగి పాడంగ మొదలాడు
నందుకే 'అందుకే'యను ప్రేమవృక్షాలపై
నెక్కి 'కాబట్టి'పుష్పాలు కోసుకొనివచ్చాను
పుష్పలావికలమ్మ పూలచెండులకన్న
బాష్పధారల పెరుగు వేదనాలతలపై
విరియబూచిన వేడినిట్టూర్పులే నీదు
చీకట్ల కురులలో సింగారమొలికించు
నందుకే 'అందుకే'యను నాదుబాధాగ్రముల
నెక్కి ప్రేయసీ నారక్త మెలుగెత్తు!